
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 24 । జనవరి । 2025




ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం శ్రీ మహంకాళి ఆలయ పునర్నిర్మాణానికి నాగిరెడ్డి వీరనారాయణరెడ్డి, ఈశ్వరమ్మ దంపతుల కుమారులు రూ. లక్ష విరాళమిచ్చారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1818 క్యూసెక్కులు, అనుబంధ కాల్వలకు కూడా నీటిని విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 557.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,633 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

నేడు చీరాలకు డీజీపీ రాక



బాపట్ల/కారంచేడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు శుక్రవారం చీరాలకు వస్తున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10:30 గంటలకు చీరాల ఒన్ టౌన్, అనంతరం కారంచేడు పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేస్తారని తెలిపారు. అనంతరం కారంచేడు పోలీస్ స్టేషన్ పైన నిర్మించిన పోలీస్ విశ్రాంతి భవనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

నారసింహుని నిత్యాన్నదానానికి విరాళం



మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరిలోని లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి దాతలు రూ.ఐదు లక్షల వితరణ అందించారు. పెనుమాకకు చెందిన కళ్లం శివారెడ్డి కుటుంబ సభ్యులు రూ.ఐదు లక్షల ఐదువేల 516ను విరాళంగా గురువారం ఆలయ సహాయ కమిషనర్ అన్నపరెడ్డి రామకోటిరెడ్డికి అందించారు.

సీజనల్ హాస్టల్ ప్రారంభానికి దరఖాస్తుల స్వీకరణ


గుంటూరు ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష ఆధ్వర్యంలో గుంటూరులోని మిర్చియార్డు సమీపంలో సీజనల్ హాస్టల్ ప్రారంభించేందుకు అర్హులైన ఎన్జీవోలు, డ్వాక్రా గ్రూపులు ఈనెల 25లోపు డీఈవో కార్యాలయంలోని సమగ్రశిక్ష ప్రాజెక్టు విభాగంలో దరఖాస్తులు సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మిర్చియార్డుకు జీవనోపాధి నిమిత్తం వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి వలస వచ్చిన కుటుంబాల్లోని పిల్లల కోసం సీజనల్ హాస్టళ్ల ఏర్పాటుకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. మొత్తం 27 సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

సబ్ జైల్లో సౌకర్యాల పరిశీలన



సత్తెనపల్లి: సబ్ జైల్లో సౌకర్యాలపై గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార కమిటీ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గుంటూరు లీలావతి ఆరా తీశారు. సత్తెనపల్లిలోని సబ్ జైలును గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ముందుగా సబ్‌జైలు పరిసరాలను పరిశీలించారు. ఆహారం, వంటశాల, స్నానపు గదులను పరిశీలించారు. రిమాండ్ ఖైదీల వివరాలుసూపరింటెండెంట్ వెంకటరత్నం వివరించారు. రిజిస్టర్ తనిఖీ చేసి, అందుతున్న వసతులను జడ్జి తెలుసుకున్నారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. రిమాండ్ ఖైదీలు చట్టప్రకారం హక్కులను తెలుసుకోవాలన్నారు. తెలిసో తెలియకో తప్పు చేసి జైలుకు వచ్చారని, భవిష్యత్తులో అందరూ సత్‌ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఏఈఆర్‌ఓగా సురేష్



సత్తెనపల్లి: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఏఈఆర్‌ఓ) అవార్డుకు పల్నాడు జిల్లా వినుకొండ తహసీల్దార్ ఎస్.సురేష్ ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం రాత్రి చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ అండ్ ఈవో సెక్రటరీ టు గవర్నమెంట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్రస్థాయిలో వివిధ హోదాలలో ఉన్న 92 మందిని ఎంపిక చేయగా.. పల్నాడు జిల్లాలో ముగ్గురికి అవకాశం లభించింది. వారిలో ఏఈఆర్‌ఓగా వినుకొండ తహసీల్దార్ ఎస్.సురేష్, బూత్ లెవెల్ అధికారులుగా గురజాల నియోజకవర్గం నుంచి ఎం.శ్రీరాములు, పెదకూరపాడు నియోజకవర్గం నుంచి ఇ.రాము ఎంపికయ్యారు. ఈ నెల 25న 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ సంబరాల్లో భాగంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకోనున్నారు.

పోలీసింగ్‌పై పచ్చ మరకలు

- ఏడు నెలల పాలనలో ఎనిమిది హత్యలు
- జోరుగా కోడిపందేలు, పేకాట కేంద్రాలు
- విచ్చవిడిగా నాటుసారా విక్రయం
- వేలసంఖ్యలో బెల్టు దుకాణాలు
- యథేచ్ఛగా గోవా మద్యం, గంజాయి సరఫరా
- వైఎస్సార్ సీపీ వారిపై అక్రమ కేసులు
- స్టేషన్‌లలో నిర్బంధించి వేధింపులు
- జిల్లా పోలీసు బాస్ తీరుపై విమర్శలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో పోలీసింగ్ పూర్తిగా గాడి తప్పిందా అంటే ప్రజల నుంచి అవుననే సమాధానాలు వినవస్తున్నాయి. బాధితుల పక్షాన నిలవాల్సిన పోలీసులు అందుకు భిన్నంగా అధికార పార్టీ నేతలు చెప్పినట్లు ప్రతిపక్ష పార్టీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి వేధిస్తున్నారు. కొందరిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పెట్టకుండా రోజుల తరబడి స్టేషన్లలో ఉంచి టార్చర్ పెడుతున్నారు. మరికొన్ని చోట్ల బాధితులు ఇచ్చిన ఫిర్యాదులను పట్టించుకోకుండా వారిపైనే రివర్స్ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

జిల్లా విచ్చలవిడి మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. గాంజా, గోవా మద్యం కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతోంది. మరోవైపు కోడిపందేలు, పేకాటతోపాటు ఇతర జూద క్రీడలు పెరిగాయి. వాటిని అదుపు చేయాల్సిన పోలీసులు కొందరు నిర్వాహకులకు సహకరిస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. సామాన్యులు కోడితో కనిపించినా సహించని పోలీసులు ఎమ్మెల్యే, మంత్రులు బహిరంగంగా కోడిపందేలు ఆడినా స్పందించకపోవడం చర్చనీయాంశగా మారింది.

ప్రతిపక్షాలపై ఖాకీల కార్యం

కొందరు పోలీసులు పచ్చనేతల కనుసన్నల్లో పని చేస్తూ ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలను, సామాన్యులను వేధిస్తున్నారు. అక్రమ కేసులు బనాయిస్తూ అరాచకం సృష్టిస్తున్నారు. బుధవారం రాత్రి బాపట్లలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని దుండగులు చింపివేశారు. గతంలోనూ ఆయన ఇంటివద్ద రెచ్చగొట్టేలా డీజేలతో రక్తచరిత్ర పాటలు పెట్టి గొడవకు దిగారు. ఈ సంఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.

జిల్లాలో గాడితప్పిన పోలీసు వ్యవస్థ



బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి ఇంటి వద్ద ఉన్న ఫ్లెక్సీలు చింపి వేసిన దుండగులు

జిల్లాలో హత్యల పరంపర

- ఏడు నెలల కాలంలోనే జిల్లాలో పెద్ద ఎత్తున హత్యలు చోటుచేసుకున్నాయి. వేటపాలెం మండలం పాపాయిపాలెంకు చెందిన పులి శ్రీనివాసరావు చీరాల ప్రాంతంలో హత్యకు గురయ్యారు. కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ నేతలు గొడవకు దిగడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి చేతులు దులువుకున్నారు.
- చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెం ఈసుఫ్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఆరీఫ్‌ను దుండగులు కత్తులతో పొడిచి చంపారు.
- చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెంలోని సీతారామపురానికి చెందిన పి.సుచరిత గతేడాది జూన్ 21 తేదీ ఉదయం 5.30 గంటల సమయంలో గంజాయి బ్యాచ్ గ్యాంగ్‌రేప్ చేసి హత్య చేయడం రాష్ట్రంలో సంచలనం రేపింది.
- చీరాల పట్టణానికి చెందిన కంచర్ల సంతోష్ (36)ను ఒక పండ్ల వ్యాపారి పండ్లు కోసే కత్తితో విచక్షణ లేకుండా పొడిచి చంపాడు.
- ఈపురుపాలెంలో రిటైర్డు ఉపాధ్యాయురాలు పిల్లి లలితమ్మ (75) ఒంటరిగా ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో స్థానిక కేబుల్ టీవీ నిర్వాహకుడు కత్తితో దాడిచేసి హతమార్చారు.
- చీరాలలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని కిడ్నాప్ చేసి హత్య చేశారు.
- రేపల్లె నియోజకవర్గం నగరం మండలం దాసరిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నున్నా భూషయ్య(47)పై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు కర్రలతో దాడి చేసి హత్య చేశారు.

ప్రశ్నిస్తే రౌడీషీట్

ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చడం లేదంటూ ఇటీవల సోషల్ మీడియాలో ప్రశ్నించినందుకు పోలీసులు బాపట్లకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జోగి రాజాపై కేసులు పెట్టి రౌడీషీట్ తెరిశారు. అద్దంకి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభాకరరెడ్డి వర్గానికి చెందిన పలువురిపై అధికార పార్టీ నేతలు ఉద్దేశపూర్వకంగా కేసులు పెట్టి సకాలంలో కోర్టులో హాజరు పెట్టకుండా వేధించారు. బాధితుల కుటుంబ సభ్యులు జిల్లా ఎస్పీ తుషార్ డూడీని కలిసి విన్నవించినా ఫలితం లేకుండా పోయింది.

దాడులు, అఘాయిత్యాలతో అరాచకపాలన



మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

- మాజీ మంత్రి మేరుగు నాగార్జున
- రిమాండ్‌లో ఉన్న యువకులకు పరామర్శ

ఒంగోలుసిటీ: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు, అఘాయిత్యాలకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తూ అరాచకపాలన సాగిస్తున్నారంటూ కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. టీడీపీ నేతలు పెట్టిన అక్రమ కేసుల వల్ల రిమాండ్‌లో ఉన్న ఏడుగురు అమాయక యువకులను ఒంగోలులోని జిల్లా జైలులో గురువారం మేరుగు నాగార్జున కలిసి మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ సంబంధం లేని కేసుల్లో ఇరికిస్తూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలను భయాందోళనకు గురిచేస్తున్నారని అన్నారు. నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌లో అధికార పార్టీ ఒత్తిడి మేరకు ఏ సంబంధం లేని కూలి చేసుకునే యువకులను కేసులో ఇరికించారని ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మనబ్రోలులో గేదె దగ్గర గొడవ అని తీసుకొచ్చి కేసులు పెట్టి ఏడుగురిని జైలుకు పంపించడం దారుణమన్నారు. అమ్మనబ్రోలులో సాయి అనే బీసీ యువకుడు వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలు కట్టాడని, ఫ్లెక్సీల దగ్గర గొడవైందని, బూతులు తిట్టాడనే కారణంతో ఒక గిరిజన అమ్మాయితో ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టించి జైలుకు పంపడం దారుణమని అన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని దుర్వినియోగం చేయవద్దని పోలీసులు, కేసులు పెట్టేవారు, ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో టీడీపీ నేతలపై కూడా ఇలాంటి కేసులు పెట్టే రోజులు వస్తాయని, అందువలన ఈ కేసులను దుర్వినియోగం చేసుకోవద్దని అన్నారు. పరిపాలనను గాలికొదిలేసి వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీ కనిపిస్తే టీడీపీ నేతలు తట్టుకోలేకపోతున్నారన్నారు. అక్రమ కేసులపై పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ కట్టినందుకే నా బిడ్డపై కుట్ర...

బాధితుడు సాయి తల్లి సలోమి మాట్లాడుతూ తన బిడ్డ వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ కట్టినందుకు ఆ ఫ్లెక్సీ చించారని, తన బిడ్డను జైలుపాలు చేశారని కన్నీరుమున్నీరుగా విలపించింది. తన బిడ్డకు న్యాయం చేయాలని వేడుకుంది.

దావోస్ పర్యటనలో సీఎం చంద్రబాబు అట్టర్‌ఫ్లాప్

దావోస్ పర్యటనలో సీఎం చంద్రబాబు అట్టర్‌ఫ్లాప్ అయ్యారని మేరుగు నాగార్జున విమర్శించారు. పట్టుమని పది కోట్లు పెట్టుబడులు తేలేకపోవడం సిగ్గుచేటన్నారు. పక్క రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వం లక్షా 32 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు సాధించిందన్నారు. పవన్‌కళ్యాణ్‌ని సైడ్ చేసి లోకేష్‌ని ప్రమోట్ చేయడానికే చంద్రబాబు, లోకేష్ పర్యటన అని అన్నారు. చంద్రబాబు దావోస్ పర్యటన ద్వారా ఏం సాధించారనే దానిపై పవన్ కల్యాణ్ నిలదీయాలన్నారు. మేరుగు నాగార్జున వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఇనగంటి పిచ్చిరెడ్డి, పోలవరపు శ్రీమన్నారాయణ, కొమ్మూరు సుధాకర్, చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, తేళ్ల పుల్లారావు, పోలినేని కోటేశ్వరరావు, కోయ హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల విన్నపాలు పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: జిల్లాలో ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధులు ఇచ్చిన విన్నపాలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రజాప్రతినిధులు ఇచ్చిన విన్నపాలు పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయడానికి ప్రభుత్వ భూములను గుర్తించి ఫిబ్రవరి 28 నాటికి నివేదికలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వ అవసరాల కోసం ఇచ్చి వినియోగంలో లేని భూములను తిరిగి తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో శ్మశాన వాటికలకు అవసరమైన భూములను పరిశీలించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన భూములు పరిశీలించి, నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. జిల్లాలో సాగునీటి కాలువల మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి పథకాల మరమ్మతులు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. చీరాల మండలంలో ఎత్తిపోతల పథకం ద్వారా 4,500 ఎకరాలకు సాగునీరు అందించడానికి ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. చీరాల కుందేరు కాలువ ఆక్రమణలు పరిశీలించాలని రెవెన్యూ, డ్రైయినేజీ అధికారులను ఆదేశించారు. మోటుపల్లి వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి పరిశీలించాలని దేవాదాయ శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారుల భూసేకరణలో నష్టపోయిన ప్రజలకు నష్టపరిహారం చెల్లించాలని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఉమా, బాపట్ల, చీరాల ఆర్డీవోలు గ్లోరియా, చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

తాత్కాలిక షెడ్స్ ఏర్పాటు చేయాలి

బాపట్ల కలెక్టరేట్‌లో ప్రజల సౌకర్యం కోసం తాత్కాలిక షెడ్స్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులకు సూచించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రజా సమస్యలపై వచ్చే ప్రజల కోసం టాయిలెట్స్, భోజన సదుపాయాలు, చేనేత వస్త్రాల ప్రదర్శన, ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయల ప్రదర్శన, ఏర్పాటు చేయడానికి 4 రకాలు షెడ్స్ నిర్మించడానికి పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం ద్వారా జీవనోపాధి కల్పించాలి

గ్రామాలలోని నిరుపేదలకు ఉపాధి హామీ పథకం ద్వారా జీవనోపాధి కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి మండల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 25 మండలాలలో కేటాయించిన పనులలో 80 శాతం కంటే తక్కువగా ఉన్న మండలాలలో జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలోపు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు రోజువారి లక్ష్యాలను నిర్దేశించినట్లు తెలిపారు. జిల్లాలో 681 గోకులాల నిర్మాణం లక్ష్యం కాగా 336 పూర్తి చేయగలిగామన్నారు. మిగిలిన లక్ష్యాలను నెలాఖరులోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 3045 నీటి కుంటలు ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటికీ 411 ఏర్పాటుకు స్థలం నిర్దేశించడం జరిగిందన్నారు. ఎంఎస్‌ఎం ఈ సర్వేలో నిర్దేశిత లక్ష్యాలలో ఎక్కువ శాతం పూర్తి చేసిన మండల అధికారులను కలెక్టర్ అభినందించారు. జిల్లాలో 100 శాతం గృహాల జియో ట్యాగింగ్ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.వి.విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ పద్మ, డీఎల్‌డీవో సీహెచ్ విజయలక్ష్మి, జీఎండీఐసీ బి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైకుంఠపురం గుడి హుండీ లెక్కింపు

తెనాలి: వైకుంఠపురం లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ తనిఖీదారు ఎస్.శారదాదేవి సమక్షంలో మూడునెలల కాలపరిమితికి భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడుల హుండీల లెక్కింపు జరిపారు. రూ.52,45,169 నగదు, అన్నదానం హుండీలో రూ.90,560 నగదు, 81.40 గ్రాముల బంగారం , 560.440 గ్రాముల వెండి వచ్చాయి. వీటితోపాటు అమెరికన్ డాలర్లు 15, ఆస్ట్రేలియా డాలర్లు 20, యూకే ఫౌండ్లు ఐదు, నేపాల్ రూ.5, జాంబియా 50 క్వాచ్చా, ఖతార్‌కు చెందిన రియాల్స్ ఐదు, ఇరాన్ కరెన్సీ 200 రియాల్స్‌ను భక్తులు సమర్పించారు. వీటితోపాటు చలామణిలో లేని రూ.2 వేల నోట్లు కూడా స్వామి హుండీల్లో వేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కుంభం సాయిబాబు, సభ్యులు కురగంటి సునీత, బొద్దులూరి సరస్వతి, మావులూరి శ్రీనివాస్, ముంతా ప్రసాద్, బట్టు దుర్గారావు, దేవరకొండ వెంకటరమణ, ఎక్స్ అఫీషియో మెంబర్ అశహరి రవికుమార్ ఉన్నారు.

జల్సాలకు అడ్డా తీరం

- చీరాల తీర ప్రాంతంలో రెచ్చిపోతున్న అసాంఘిక శక్తులు
- ఖాకీల కనుసన్నల్లోనే పేకాట స్థావరాలు
- మళ్లీ మొదలైన ర్యాప్‌లు, కోడిపందేలు

చీరాల: పర్యాటకంగా అభివృద్ధి చెందిన చీరాల ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో జల్సాలకు అడ్డాగా మారింది. శివారు కాలనీలు, కుందేరు ఒడ్డున పేకాట స్థావరాలు, తీరప్రాంతంలో యథేచ్ఛగా కోడి పందేలు, నెంబర్లాట, తక్కువ ధరకే బంగారం పేరుతో ర్యాప్‌లు వంటి మోసాలు జోరుగా సాగుతున్నాయి. సీఎం చంద్రబాబునాయుడు పేరుతో ఆన్‌లైన్ మోసాలు ఇక్కడ నిత్యం జరుగుతున్నా అడ్డుకట్ట వేసేవారు కానరావడంలేదు. అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోవాల్సిన పోలీసుల్లో కొందరు అక్రమార్కులు, నేరగాళ్లు, జూదగాళ్లకు అండగా నిలబడుతున్నారు.

పర్యాటకుల ముసుగులో కోడి పందేలు

పర్యాటక రంగంలో దూసుకెళ్తున్న చీరాల్లోని తీర ప్రాంతంలో జల్సాలకు కొదువేలేదు. ఇక్కడ ఉన్న రిసార్ట్‌లు, హోటళ్లలో జల్సాలకు తక్కువేమీ కాదు. తీర ప్రాంత గ్రామాలైన రామాపురం, వాడరేవు, పొట్టిసుబ్బయ్యపాలెంలో పర్యాటకులు అధికంగా వస్తుంటారు. పర్యాటకుల ముసుగులో కోడి పందేలు జోరుగా జరుగుతూనే ఉన్నాయి. కొన్ని రిసార్ట్‌లు పేకాట ఆడేవారికి, ఇతర అసాంఘిక కార్యకలాపాలు చేసే వారికి ప్రత్యేక వసతులు, ఏర్పాట్లు చేస్తున్నారనే ప్రచారం ఉంది.

తక్కువ ధరకే బంగారం పేరుతో మోసాలు

తక్కువ ధరకే బంగారం ఇస్తామని డబ్బులు తీసుకుని మోసాలు చేసే ర్యాప్ ముఠాలు మళ్లీ జడలు విప్పాయి. గడిచిన ఐదేళ్లలో ర్యాప్ ముఠాలపై అప్పటి పోలీసులు ఉక్కుపాదం మోపారు. కానీ ప్రస్తుతం పోలీసులు ర్యాప్ ముఠాలు, పేకాట డాన్‌లు, కోడి పందేల నిర్వాహకులతో లాలూచీ పడి పట్టించుకోవడం లేదు. నాలుగు రోజుల కిందట చీరాల రూరల్ స్టేషన్ పరిధిలో తక్కువ ధరకే బంగారం పేరుతో రూ.32 లక్షల ర్యాప్ జరిగింది. బాధితులు లబోదిబోమంటున్నా పట్టించుకోవడంలేదు.



కుందేరు శివారు ప్రాంతంలో నోట్ల కట్టల మధ్య జరుగుతున్న కోతముక్క ఆట

లక్షల్లో లావాదేవీలు..

వివిధ రకాల జూదాల్లో రోజుకు సుమారు రూ.15 లక్షలు చేతులు మారుతున్నాయనే సమాచారం ఉంది. ఇలా నెలకు సుమారు రూ.4 కోట్ల మేర లావాదేవీలు జరుగుతున్నట్లే. అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రతీ స్టేషన్‌లో స్పెషల్ బ్రాంచ్, అనుమతి లేని ఐడీ పార్టీ పోలీసులున్నారు. వీరు పాత నేరస్తులు, పేకాట, నాటుసారా, జూదాలు, అక్రమాలపై నిఘా ఉంచి ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించి నేరాలను అడ్డుకోవాలి. కానీ పట్టించుకోవడం లేదు.

పోస్టుకు ఇంతనే లెక్క..

ప్రత్యేక పోలీసు విభాగంలో పనిచేస్తున్న కొందరు సిబ్బంది అక్రమాలు చేసే వారితో లాలూచీ పడి నెలకు స్టేషన్‌కు రూ.30 వేలు, హెడ్‌కానిస్టేబుల్‌కు రూ.10 వేలు, కానిస్టేబుల్ హోంగార్డులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు, ప్రత్యేక కానిస్టేబుల్‌కు రూ.20 వేలు, అనధికార ఐడీ పార్టీ సభ్యులకు రూ.20 వేలు చొప్పున ఇస్తున్నట్లు సమాచారం.

ఆపేదెవరు?

చీరాల నియోజకవర్గం పరిధిలోని చీరాల ఒన్ టౌన్, చీరాల టూటౌన్, చీరాల రూరల్ సర్కిళ్లు, ఈపురుపాలెం, వేటపాలెం పోలీస్‌స్టేషన్లున్నాయి. చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రామ్‌నగర్, 300 కాలనీ, కంపెనీ వెనుక ఉన్న ప్రదేశంలో పేకాట, కోత ముక్కకు అడ్డాగా మారింది. కుందేరు ఆనుకుని ఉన్న ప్రదేశంలో ప్రతిరోజూ మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పేకాట, కోత ముక్క జోరుగా సాగుతోంది. ఇక్కడ రోజుకు రూ.8 నుంచి రూ.10 లక్షల మేర చేతులు మారుతున్నాయి. ఇక్కడ పేకాట నిర్వహిస్తున్న వారిని నుంచి టూటౌన్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ హెడ్‌కానిస్టేబుల్, హోంగార్డు, ప్రత్యేక కానిస్టేబుల్ నెలకు రూ.50 వేల మేర మామూళ్లు తీసుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన అవసరం

ఆర్టీఓ టి.కె.పరంధామరెడ్డి

బాపట్ల: విద్యార్థులు రహదారి భద్రతపై అవగాహన ఉండాలని ఆర్టీఓ టి.కె.పరంధామరెడ్డి పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా గురువారం పిట్టలవానిపాలెంలోగల కేర్ యోగ, నేచురోపతి మెడికల్ కాలేజ్ విద్యార్థులకు రహదరి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్టీఓ మాట్లాడుతూ విద్యార్థులు నిబంధనలు పాటిస్తూ మిగిలిన వారికి ఆదర్శంగా ఉండాలని అన్నారు. యువత ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని, నిబంధనలు పాటించకపోవడమే అందుకు కారణమని పేర్కొన్నారు. చట్టాలు ఉన్నది ప్రజల రక్షణ కోసమేనని వాటిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు. ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని, నాలుగు చక్రాల వాహనం నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని విద్యార్థులకు సూచించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.బి.వి.రంగారావు మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని తెలిపారు. ప్రమాదాలు జరగడానికి గల పలు కారణాలను విద్యార్థులకు వివరించారు. రోడ్ సేఫ్టీ మెడికల్ ఆఫీసర్ నరేంద్రకుమార్ ఫస్ట్ ఎయిడ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ శ్రీమన్నారాయణ, కాలేజ్ యజమాని కిషోర్‌రాజు, కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ సౌమ్య మహేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీఓ టి.కె.పరంధామరెడ్డి

రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అధికారులుగా నలుగురు ఎంపిక

బాపట్ల: రాష్ట్ర స్థాయిలో ఎన్నికల సందర్భంగా ఉత్తమ సేవలు అందించినందుకు బాపట్ల జిల్లాలో పలువురు అధికారులను ఎన్నికల కమిషన్ ఎంపిక చేసింది. పోలీసు ఐటీ విభాగం నుంచి ఎస్సై షేక్.నాయబ్‌రసూల్, వివిధ విభాగాలకు చెందిన ఎం.శిరీష, సుబ్బయ్య, సునీల్ ఎంపికయ్యారు. గురువారం రాత్రి చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ అండ్ ఈవో సెక్రటరీ టు గవర్నమెంట్ నుంచి ఉత్తర్వులు వెలుపడ్డాయి. రాష్ట్రస్థాయిలో వివిధ హోదాలో ఉన్న 92 మందిని ఎంపిక చేయగా వీరిలో బాపట్ల నుంచి పలువురు అధికారులు ఉన్నారు. ఈనెల 25న 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ సంబరాల్లో భాగంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా వీరికి అవార్డులు అందజేయనున్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ అధికారులుగా ఎంపికైన రసూల్, శిరీష, సుబ్బయ్య, సునీల్‌లను పలువురు అభినందించారు.

విధుల నుంచి తొలగించటంపై చర్యలు తీసుకోవాలి



డీఈఓ ఎస్.పురుషోత్తంకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బాపట్ల: పర్చూరు మండలం చెరుకూరు ఆంధ్రకేసరి మెమోరియల్ రెసిడెన్షియల్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను తొలగించటంపై చర్యలు తీసుకోవాలని ఏపీ టీచర్స్ గిల్డ్ బాపట్ల, ప్రకాశం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శులు జి.వెకంటేశ్వర్లు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి కోరారు. బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తంను గురువారం కలిసి వలంటీరి రిటైర్మెంట్ ఇవ్వలేదని ఉపాధ్యాయులు సీహెచ్ వెంకటేశ్వర్లు, కె.పద్మావతిలను గత సంవత్సరం ఫిబ్రవరి నుంచి జీతాలు నిలుపుదల చేసిన యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్.పురుషోత్తంకు వినతిపత్రం అందించారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామ రాజును కలిసి సమస్యను వివరిస్తామని తెలిపారు.

ఏషియన్ యోగాలో శ్రీకృష్ణకు బంగారు పతకం



ధీరజ్ శ్రీకృష్ణను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: భాష్యం విద్యార్థులు చదువుతో పాటు తాము ఎంచుకున్న రంగాల్లో రాణిస్తూ, అంతర్జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చడం గర్వకారణంగా ఉందని విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. చంద్రమౌళి నగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ అశోక్‌నగర్‌లోని భాష్యం స్కూల్లో తొమ్మిదో తరగతి (ఐఐటీ) చదువుతున్న దేవరాజుగట్టు ధీరజ్ శ్రీకృష్ణ సింగపూర్‌లో ఈనెల 6వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరిగిన ఏషియన్ యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో భారతజట్టుకు ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. బంగారు పతకంతోపాటు రెండు రజత, కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నట్లు చెప్పారు. ఏషియన్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో 47 ఏళ్ల తరువాత ఆంధ్రప్రదేశ్ విద్యార్థికి బంగారు పతకం వచ్చిందని చెప్పారు. బాలుర జూనియర్ విభాగంలో తలపడిన ధీరజ్ శ్రీకృష్ణ ఆర్టిస్టిక్ యోగాలో బంగారు పతకం, యోగాసన, ఆర్టిస్టిక్ పెయిర్ యోగాసనలో రజతం, రిథమిక్ యోగాలో కాంస్య పతకాలు గెలుపొంది సత్తా చాటాడని వివరించారు. యోగాలో ప్రతిభను గుర్తించి గతంలో భాష్యం తరపున రూ.లక్ష నగదు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ధీరజ్ శ్రీకృష్ణ తండ్రి నాగరాజు, తల్లి శశికళ పాల్గొన్నారు.

పశుగణాభివృద్ధికి విశేష కృషి



వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న పశు వైద్యులు

పర్చూరు(చినగంజాం): గ్రామీణ ప్రాంతాల్లో తగ్గుతున్న పశు సంపదను అభివృద్ధి చేసేందుకు విశేష కృషి చేస్తున్నట్లు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి చేకూరి చంద్రశేఖర్ అన్నారు. గురువారం నాగులపాలెం గ్రామంలో పశుసంతానోత్పత్తి శిబిరాన్ని సర్పంచ్ దాసి సుధారాణి ప్రారంభించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 31వ తేదీ వరకు పశువుల ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లింగ నిర్ధారిత వీర్యం ద్వారా 90 శాతం పశువుల్లో కచ్చితంగా మేలుజాతి పెయ్యి దూడలను పుట్టించవచ్చు అని తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ మేలు జాతి పెయ్యి దూడలు ఉత్పత్తి కావడం వలన గ్రామాల్లో పశుసంపద అభివృద్ధి చెందుతున్నారు. ఒట్టిపోయిన పశువులకు కూడా పిండ మార్పిడి పరిజ్ఞానాన్ని ఉపయోగించి మేలు జాతి దూడలను ఉత్పత్తి చేయవచ్చని వివరించారు. ఈ పరిజ్ఞానం ద్వారా 33 దూడలను పుట్టించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో 75 గేదెలను 15 ఆవులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి బి.వేణుగోపాల్ తెలిపారు. ప్రత్యేక అధికారి పి.షానీలా, ఏడీ మాధవి, వైద్యాధికారులు డాక్టర్ భాగ్యరాజ్, డాక్టర్ రవి, డాక్టర్ అరుణ, గోపాల మిత్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవచన సప్తాహ యజ్ఞం ప్రారంభం



నాగఫణిశర్మ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయం అన్నమయ్య కళావేదికపై ముప్పవరపు కేశవరావు శతజయంత్యుత్సవం సందర్భంగా తొమ్మిది రోజుల పాటు జరగనున్న శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహ యజ్ఞాన్ని గురువారం రాత్రి పండితుల వేదస్వస్తితో ప్రారంభించారు. ముప్పవరపు వెంకటసింహాచలశాస్త్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలిరోజు రామాయణ నవాహ ప్రారంభకులు బాలకాండ మహాకవి డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ (హైదరాబాద్) ప్రవచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ జ్యూడిషియల్ అకాడమి (అమరావతి) ఎ.హరిహరనాథశర్మ, ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో కంటి సమస్యలు దూరం



మాట్లాడుతున్న అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. సత్యశ్రీ

నరసరావుపేటటౌన్: సరైన పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవటంతోపాటు కంటి నిండా నిద్ర ఉంటే కంటి సమస్యలు దరిచేరవని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. సత్యశ్రీ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో గురువారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలు, పెద్దలు కంటి సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. పిల్లలు ఎక్కువగా టీవీ, సెల్‌ఫోన్‌లు చూడటం వలన సమస్యలు వస్తున్నట్లు తెలిపారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే కంటి సమస్యల బారిన పడకుండా ఉండొచ్చని అన్నారు. అనంతరం ఎంవీ రెడ్డి కంటి వైద్యశాల డాక్టర్ ఎల్. సృజన ప్రత్యేక అవసరాల పిల్లలకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. పాఠశాల డైరెక్టర్ ఏపీవీ ఇందిర, సిబ్బంది పాల్గొన్నారు.

సౌత్ సెంట్రల్ రైల్వే న్యాయ సలహాదారుడిగా ఉల్లం



సత్తెనపల్లి: సౌత్ సెంట్రల్ రైల్వే న్యాయ సలహాదారుడిగా పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది ఉల్లం శేషగిరిరావు నియమితులయ్యారు. ఈమేరకు న్యాయశాఖ సికింద్రాబాద్ న్యాయాధికారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కృషి చేసిన కమతం కాశిరెడ్డి, పాపిరెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉల్లం నియామకంపై ఏజీపీ బగ్గి నరసింహారావు, సీనియర్ న్యాయవాది పిన్నమనేని పాములయ్య, దివ్వెల శ్రీనివాసరావు, పలువురు న్యాయవాదులు తదితరులు హర్షం వెలిబుచ్చారు.

టీపీఎస్ సునీతకు టీపీఓగా పదోన్నతి



సత్తెనపల్లి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.సునీతకు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు గురువారం రాత్రి టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ ఆర్.జె.విద్యుల్లత నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆమెను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. పదోన్నతి పొందిన సునీతకు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు, టీపీఎస్ రిజ్వానా, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, అభినందనలు తెలిపారు.

ఐదుగురికి 22 నెలల జైలు శిక్ష

రూ.50 వేలు జరిమానా

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): కట్న వేధింపులు, గృహహింస కేసులో ఐదుగురికి 22 నెలల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధి స్తూ గుంటూరు రెండో అదనపు సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్) జడ్జి దీప్తి గురువారం తీర్పు వెలువరించారు. రామిరెడ్డినగర్‌లో ఉంటున్న ఓ మహిళ తన భర్త, మామ, బంధువులపై అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఫిబ్రవరి 12 2021న మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఏఎస్ఐ ఎండీ.అసదుల్లాఖాన్ కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ ఖాజీబాబు దర్యాప్తు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నేరం రుజువుకావడంతో భర్త, మామతోపాటు ముగ్గురు బంధువులకు 22 నెలల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ఈ కేసులో న్యాయవాదులు, పోలీసులు సంయుక్తంగా కృషి చేయడం వల్లే నిందితులకు శిక్ష పడిందని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు.

మనోవేదనకు గురై విద్యార్థి ఆత్మహత్య



నవదేవ్ (ఫైల్)

మంగళగిరి (తాడేపల్లిరూరల్): చదువు ఒత్తిడి తట్టుకోలేక మనోవేదనకు గురై ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళగిరి మండలంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మంగళగిరి మండలం కురగల్లులోని అమృత విశ్వవిద్యాలయ పీఠంలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న కె.కె. నవదేవ్ (22) గురువారం హాస్టల్ రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నవదేవ్ తమిళనాడు రాష్ట్రానికి చెందిన వాడని, మానసిక ఒత్తిడితో చదవలేకపోతున్నాని మనసు స్థిమితంగా ఉండడం లేదని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. రెండు సూసైడ్ నోట్లు ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. నా చావుకు ఎవరూ కారణం కాదని ఆ సూసైడ్ నోట్‌లో రాసి ఉందని వివరించారు. ఘటనా స్థలానికి వెళ్లి పోలీసులు తోటి విద్యార్థులను విచారణ చేశారు. నవదేవ్ తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని రూరల్ ఎస్ఐ వెంకట్ తెలిపారు.

ఊరబండి మన్నెయ్యపై పీడీ యాక్ట్

నరసరావుపేట: మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలం జంగమేశ్వరపాడు గ్రామానికి చెందిన ఊరబండి మన్నెయ్యపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు గురువారం రాత్రి పేర్కొన్నారు. 2010 నుంచి 2024 ఎన్నికల వరకు అతనిపై 15 కేసులు నమోదయ్యాయని అన్నారు. హత్య, హత్యాయత్నం, ఎక్స్‌ప్లోజీవ్ కేసులతోపాటు ఎన్నికల రోజు, అనంతరం జరిగిన కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని వెల్లడించారు. సుమారు 15 కేసులలో నిందితుడైనందున పీడీ యాక్ట్ పెట్టినట్లు వివరించారు.

గొంతులో ఇరుక్కున్న చికెన్ ముక్క తొలగింపు



గుంటూరు మెడికల్: శుభ కార్యాయానికి వెళ్లి మద్యం మత్తులో తింటున్న సమయంలో చికెన్ ముక్క గొంతుకు అడ్డుపడి మూడు రోజులుగా అవస్థలు పడిన వృద్ధుడికి గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు చికిత్స చేశారు. ముక్కను తొలగించి నొప్పి నుంచి విముక్తి కల్పించారు. గుంటూరుకు చెందిన 72 ఏళ్ల షేక్ అదంషఫీ మూడు రోజుల క్రితం బంధువుల ఇంట్లో శుభ కార్యానికి వెళ్లాడు. అక్కడ మద్యం తీసుకుని చికెన్ బిర్యానీ తింటున్న సమయంలో చికెన్ ముక్క గొంతులో ఇరుక్కుంది. మూడు రోజులపాటు కనీసం మంచినీరూ తాగలేక అవస్థలు పడ్డారు. చికిత్స కోసం జీజీహెచ్‌కు వచ్చాడు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగాధిపతి డాక్టర్ అనుమల కవిత తొలుత ఎక్సరే తీశారు. ఆ తర్వాత ఎండోస్కోపి చేసి గొంతులో ఇరుక్కున్న చికెన్ ముక్క బయటకు తీశారు. బాధ నుంచి విముక్తి కల్పించారు. మూడు రోజుల పాటు చికెన్ ముక్క గొంతులో ఇరుక్కుని ఉండటం ద్వారా గొంతు లోపలి భాగంలో పుండ్లు ఏర్పడ్డాయని వైద్యులు తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి



చీరాల రూరల్: బొకోరో ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకోగా గురువారం వెలుగు చూసింది. జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాల మేరకు...చీరాల–వేటపాలెం రైల్వేస్టేషన్ల మధ్య ఎంజీసీ హౌసింగ్ కాలనీ సమీపంలో ఎగువ లైన్‌పై రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడనే సమాచారంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. మృతుని వద్ద ఎలాంటి సమాచారం లభించలేదని చెప్పారు. మృతుడి వయస్సు 65 సంవత్సరాలు ఉంటాయని, 5.5 ఎత్తుతో చామనఛాయ రంగు కలిగి ఉన్నాడని.. ఛాతీ మధ్యలో పుట్టుమచ్చ ఉన్నదని చెప్పారు. మృతుడి శరీరంపై ఆకుపచ్చ రంగు పట్టీలుగల నిండు చేతులు షర్ట్, బులుగు, నలుపు, ఆకుపచ్చ రంగు గడులు గల లుంగీ ఉన్నట్లు చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతుడి ఆధారాలు ఎవరికైనా లభిస్తే 9440627646 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

ప్రహరీని ఢీకొట్టిన టిప్పర్

కూలిన గోడ..నిలిచిన ట్రాఫిక్



చీరాలటౌన్: ఓ టిప్పర్ డ్రైవర్ వేగంగా వచ్చి ఓ ఇంటి ప్రహరీని ఢీకొట్టడంతో అది కూలిపోయింది. రోడ్డు మార్జిన్ ఉందనే అపోహతో వేగంగా వచ్చి రోడ్డు పక్కన ఉన్న ఇంటి ప్రహరీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అంతేగాక రోడ్డు పక్కన ఉన్న చెట్టును కూడా ఢీకొట్టడంతో చెట్టు కొమ్మలు విరిగి ప్రధాన రోడ్డుపై పడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటన గురువారం చీరాల–బాపట్ల ప్రధాన రహదారిలోని శాంతినగర్ వద్ద చోటుచేసుకుంది. తోటవారిపాలెంలో నిర్మాణం చేస్తున్న జాతీయ రహదారికి కావాల్సిన కంకరను తీసుకెళుతున్న టిప్పర్ డ్రైవర్ అజాగ్రత్త వల్ల ఇలా జరిగింది. రోడ్డుపై ప్రజలు ఎవ్వరు లేకపోవడంతో ప్రమాదంలో ప్రాణ నష్టం జరగలేదు.

తగ్గిన పంటల విస్తీర్ణం

గుంటూరు రూరల్: రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పంటల విస్తీర్ణం తగ్గినట్లుగా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ వై.రాధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయినా నూతన సాంకేతికత పద్ధతులను ఆచరించటం వల్ల ఉత్పత్తిలో గణనీయమైన లోటు నమోదు కాలేదని పేర్కొన్నారు. పంటల ధరలు మాత్రం నిరాశజనకంగానే ఉన్నాయని వివరించారు.

యార్డులో ఉచిత మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

- భోజన శాల వద్ద రైతుల పడిగాపులు
- కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేల డుమ్మా



రైతులకు భోజనం వడ్డిస్తున్న మార్కెటింగ్‌శాఖ కమిషనర్ విజయ సునీత, జేసీ భార్గవ్ తేజ

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో రైతు ఉచిత మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఎం.విజయ సునీత, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజలు గురువారం ప్రారంభించారు. ఉదయం 10.45 గంటలకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయుల చేతుల మీదుగా రైతు ఉచిత భోజన పథకం ప్రారంభించాల్సి ఉంది. కానీ కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేలు ప్రారంభోత్సవానికి డుమ్మా కొట్టారు. దీంతో అప్పటికే అమానత్ పట్టి ఆధారంగా ఉచిత భోజనానికి రసీదులు పొందిన రైతులు మధ్యాహ్నం 12.10 గంటల వరకు భోజన శాల బయట పడిగాపులు కాయాల్సి వచ్చింది. మధ్యాహ్నం 12.15 గంటలకు జాయింట్ కలెక్టర్ అక్కడకు చేరుకున్నారు. మార్కెటింగ్‌శాఖ కమిషనర్ ఎం.విజయ సునీత రాక కోసం జాయింట్ కలెక్టర్ సుమారు 25 నిమిషాల పాటు వేచి చూడాల్సి వచ్చింది. మధ్యాహ్నం 12.40 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ విజయ సునీత, జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజలు మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ సహాయ సంచాలకులు బి.రాజబాబు, యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు, యార్డు ఇన్‌చార్జి సుబ్రమణ్యం, అసిస్టెంట్ ఇన్‌చార్జి శ్రీకాంత్, యార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యూహాత్మకంగా గంజాయి ముఠా ఆటకట్టు

వివరాలు వెల్లడించిన నార్త్‌జోన్ డీఎస్పీ మురళీకృష్ణ



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న నార్త్‌జోన్ డీఎస్పీ మురళీకృష్ణ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరించి గంజాయి ముఠా ఆట కట్టించారు. ఆరుగురిని అరెస్టు చేశారు. నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ గురువారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ కళ్యాణ్‌రాజుతో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం .. ఇటీవల గంజాయి కొనుగోలు చేసిన బండిరెడ్డి నందు అలియాస్ బాలును పోలీసులు పట్టుకుని వదిలివేశారు. దీనిపై విమర్శలొచ్చినా లెక్కచేయలేదు. వ్యూహాత్మకంగా అతనిపై నిఘా పెట్టారు. మరింత సమాచారం సేకరించారు. అతనిచ్చిన సమాచారం మేరకు తాడేపల్లి కృష్ణాకెనాల్ జంక్షన్ పరిధిలో బాలుతోపాటు షేక్ మహబూబ్ బాషా, ఊట్ల ప్రవీణ్, షేక్ మహబూబ్ జానీ, మేడా ఆనందరావు, షేక్ జానీ గంజాయి కొనుగోలు చేసి తాగుతూ ఉండగా అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి కేజీ 200 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. వీరికి గంజాయి సప్లయ్ చేస్తున్న మణికుమార్ పరారయ్యాడు., అతన్ని కూడా త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ఇదిలా ఉంటే పట్టుబడిన వారిలో గంజాయి కలిగి ఉన్న వారు ఇద్దరు మాత్రమే అని, మిగిలిన వారు గతంలో గంజాయి సేవించి పలు గొడవల్లో ఉన్న వారని, వారిని తాడేపల్లి పోలీసులు ఇంట్లో ఉన్న సమయంలో బలవంతంగా తీసుకువచ్చి కేసు నమోదుచేశారని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.5.67 కోట్లు టోకరా

- పెట్టుబడుల పేరుతో ఘరానా మోసం
- స్నేహితుడిని నమ్మించి మోసం చేసిన నిందితుడు
- అరెస్టు చేసిన అరండల్‌పేట పోలీసులు

లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): కెమికల్ వేస్ట్ వ్యాపారంలో పెట్టుబడి పెడితే అధికమొత్తంలో లాభాలు ఆర్జించవచ్చని స్నేహితుడిని నమ్మించి రూ.5.67 కోట్ల మేర దోచేసిన ఘరానా మోసగాడిని అరండల్ పేట పోలీసులు గురువారం అరెస్టుచేశారు. సీఐ వీరాస్వామి కథనం ప్రకారం.. గుంటూరు హిందూ కళాశాలలో టూరు రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన రాజుపాలెంరమేష్, పెదకూరపాడు ప్రాంతానికి చెందిన పమిడిపల్లి అనీల్‌కుమార్ కలిసి చదువుకున్నారు. అనిల్ కుమార్ హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. కొంత కాలం కెమికల్ ఫ్యాక్టరీలో పనిచేశాడు. స్నేహితుల వద్ద కొంత డబ్బు అప్పుగా తీసుకుని శానిటైజర్ వ్యాపారం ప్రారంభించాడు. నష్టం రావడంతోపాటు వ్యసనాలకు బానిసయ్యాడు. అప్పుల పాలయ్యాడు. అప్పులు ఎలాగైనా తీర్చాలని మోసానికి పథకం పన్నాడు. స్నేహితుడు రాజుపాలెం రమేష్‌ను కలిసి ఎన్ఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీ కెమికల్ రీసైక్లింగ్ , కెమికల్ వేస్టేజ్ పరిశ్రమ నడుపుతోందని, దీనిలో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని మాయమాటలు చెప్పాడు. నమ్మిన రమేష్‌కొంత మొత్తం ఇచ్చాడు. లాభాలు బాగానే ముట్టజెప్పి నమ్మకం కల్పించాడు. దీంతో రమేష్ తన పరిచయస్తులు సుమారు 32 మంది వద్ద నుంచి సుమారు రూ.14,61,44,705 పెట్టుబడిగా పెట్టించాడు. ఆ తర్వాత అనిల్ వారికి చెప్పిన లాభాలు ఇవ్వలేదు. అసలు కోసం అడిగినా తప్పించుకుని తిరిగాడు. దీంతో రమేష్ ఈనెల 15న అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ వీరాస్వామి, వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ పర్యవేక్షణ్‌లో ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేశారు. అనిల్ కుమార్ గురువారం గుంటూరు బొంగరాల బీడు వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో వలపన్ని అరెస్టు చేశారు. తనకు డబ్బు ఇచ్చిన వారిలో కొందరికి రూ. అనిల్‌కుమార్‌ను పోలీసులు విచారించగా పెట్టుబడి పెట్టిన వారిలో కొందరికి తిరిగి రూ.8,94,41,200 వరకు చెల్లించానని, రూ.5,67,03,605 కోట్లు చెల్లించాలని వివరించాడు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సీఐ వీరాస్వామి, ఎస్సై కృష్ణబాబజీబాబు, హెడ్ కానిస్టేబుల్ శివనాగేశ్వరరావు, అప్పలనాయుడు, రామకృష్ణ, బాలశివశంకర్‌ను జిల్లా అధికారులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

భర్తకు స్వల్ప గాయాలు

పొన్నూరు: మండల పరిధి పచ్చలతాడిపర్రు గ్రామంలోని ప్రధాన రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం. తెనాలి మండలం చావావారిపాలెం గ్రామానికి చెందిన భార్యాభర్తలు పెరుగుమాల సుందరరావు, రత్నకుమారి తెనాలి నుంచి ద్విచక్ర వాహనంపై బాపట్ల వైపు వెళుతుండగా గుంటూరు నుంచి బాపట్ల వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రత్నకుమారి (41) అక్కడికక్కడే మృతి చెందగా, భర్తకు స్వల్ప గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఒ.లలిత

లక్ష్మీపురం(గుంటూరువెస్ట్) : అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయుసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒ.లలిత డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక అమరావతి రోడ్డులోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏఐటీయుసీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వేతనాల పెంపుపై కూటమి ప్రభుత్వం ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా తమను పిలిచి సమస్యలపై చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు. త్వరలో పరిష్కారమవుతాయని చెప్పారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడ హనుమంతరావు, స్వరూపరాణి, విజయ దుర్గ, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు తదితరులు ఉన్నారు.

28 నుంచి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

రెంటచింతల: ఫిబ్రవరి 2వ తేదీన జరగనున్న కానుకమాత చర్చి 175 తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28వ తేదీ నుంచి జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను గురువారం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈ పోటీలు ఉంటాయి. ప్రతి విభాగంలో 9 బహుమతుల చొప్పున 54 మంది విజేతలకు మొత్తం రూ. 16.30 లక్షల నగదు అందచేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 28న రెండు పళ్ల విభాగం, 29న నాలుగు పళ్ల విభాగం, 30న ఆరు పళ్ల విభాగం, 31న న్యూ కేటగిరీ, ఫిబ్రవరి 1వ తేదీన జూనియర్స్ విభాగం, 3వ తేదీన సీనియర్స్ విభాగంలో పోటీలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అల్లం ప్రతాప్‌రెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, గొంటు సుమంత్ రెడ్డి, తుమ్మా జోజిరెడ్డి, గాదె కిరీటిరెడ్డి, బొడపాటి రామకృష్ణ, ఓరుగంటి ఇన్నారెడ్డి, మూలి రాజారెడ్డి, కొమ్మారెడ్డి జోసఫ్‌రెడ్డి, మొండెద్దు చిన్న శౌరెడ్డి, ఏరువ జోజిరెడ్డి, గొంటు రవికిరణ్‌రెడ్డి, వై. అప్పయ్య, షేక్ బుజ్జి, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.